హైదరాబాద్ వార్త

తూకం..మోసం

-నిండా మునుగుతున్న వినియోగదారులు
-సాధారణ కాంటా, ఎలక్ట్రానిక్
-మెషిన్లలోనూ చేతివాటం
-ప్యాకేజీ సరుకుల్లోనూ అంతే
-కిరాణ నుంచి సూపర్ మార్కెట్ వరకు
-వీధి వ్యాపారాల నుంచి మాంసం మార్కెట్ల వరకు మోసాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఉప్పల్‌కు చెందిన బుర్రా వెంకటేశ్వర్లు సమీపంలోని ఓ కిరాణాషాపునకు వెళ్లి కిలో కందిపప్పు, అరకిలో చింతపండు, లీటర్ వంట నూనె ప్యాకెట్ కొనుగోలు చేశాడు. కంది పప్పు, చింతపండును ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్‌పై తూచి ఇవ్వడంతో కరెక్టుగానే ఉంటుందని భావించాడు. ఇంటికొచ్చాక అనుమానం రావడంతో తూకం వేసి చూశాడు. కందిపప్పు 950 గ్రాములు,చింతపండు 450 గ్రాములే ఉండడంతో అవాక్కయ్యాడు. ఇక ప్యాకింగ్ చేసిన లీటర్ నూనె ప్యాకెట్ కూడా 870 మిల్లీలీటర్లే ఉండడంతో మోసపోయానని గ్రహించాడు.

ఇలా ఒక బుర్రా వెంకటేశ్వర్లనే కాదు..ఎంతో మంది నగరవాసులు దోపిడికి గురవుతున్నారు. నగరంలో చిన్న కిరాణషాపు నుంచి సూపర్ మార్కెట్ల వరకు తూకంలో చేతివాటం ప్రదర్శిస్తుండడంతో వినియోగదారులు మోసపోతున్నారు. బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయలు, పండ్లు, మాంసం..ఇలా ఏది కొనుగోలు చేసినా కిలోకు 900-950 గ్రాములే వస్తోంది. ఇక లీటర్లలో కొనుగోలు చేసి వస్తువులైతే లీటర్‌కు 800-850 మిల్లీలీటర్లే వస్తున్నాయి. సాధారణ కాంటాతో పాటు ఎలక్ట్రానిక్ మెషిన్లలో సెట్టింగ్‌లు చేస్తూ వ్యాపారులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. చట్టాల్లోని లొసుగులే ఆసరాగా దోపిడీ చేస్తూ తప్పించుకుంటున్నారు. వీటన్నింటినీ అరికట్టాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రేటర్‌లో పెద్ద, చిన్నాచితకా వ్యాపార సంస్థలన్నీ కలిపి సుమారు 4లక్షలకు పైగానే ఉంటాయి. వీటిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, మోసాలను అరికట్టాల్సిన బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారులపై ఉంది. అయితే వారు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు వేస్తున్నారు. తూకాల్లో మోసం, నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు మొదటిసారి జరిమానా విధిస్తారు. అదే తప్పు తిరిగి చేస్తే కేసు నమోదు చేసి కోర్టుకు సిఫార్సు చేస్తారు. కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే కోర్టు జైలు శిక్ష విధించిన కేసులు పెద్దగా లేనట్లు తెలుస్తోంది. తక్కువ తూకం వేస్తే తూనికలు, కొలతల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2009 యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం కనీసం రూ. 1000 నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తారు. ప్యాకేజీ కమోడిటీ యాక్ట 30 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.2వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా వేస్తారు.

ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో ఒకదాని సహాయంతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. కిలోకు 50-100 గ్రాములు తక్కువగా ఉండేలా సెట్ చేస్తున్నారు. అప్పుడు ఆ ఆప్షన్ నొక్కి మెషిన్‌పై 900-950 గ్రాముల బరువు ఉంచితే అది 1000గ్రాములు (కిలో)గా డిస్‌ప్లే అవుతుంది. అంటే కిలోకు 50 నుండి 150 గ్రాముల వరకు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మెషిన్‌లోని మరో ఆప్షన్‌ను నొక్కితే తూకం సక్రమంగా వస్తుంది. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సరైనా ఆప్షన్‌తో తూకం వేస్తూ వ్యాపారులు బోల్తా కొట్టిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు బయటపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. మార్కెట్‌లో లభించే వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లు కూడా నిర్దేశించిన బరువు కంటే తక్కువగా ఉంటున్నాయి. లీటర్ ప్యాకేజ్‌డ్ నూనె నిబంధనల ప్రకారం ప్యాకెట్‌లో 910 మిల్లీలీటర్లు ఉండాలి. కానీ కొన్ని ప్యాకేజ్‌లో 800-850 గ్రాములు మించడం లేదు. ఇక ఐదు లీటర్ల ప్యాకేజ్‌డ్ బాటిల్‌లో 200-280 గ్రాములు, 15 లీటర్ల ప్యాకేజ్‌డ్ బాటిల్‌లో 250-300 మిల్లీలీటర్లు తక్కువగా ఉంటోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. తక్కువ తూకంగల ప్యాకింగ్‌లు సైతం తూనికలు, కొలతల శాఖ దాడుల్లో బయటపడడమే ఇందుకు నిదర్శనం

నగరంలోని పెద్ద పెద్ద దుకాణాల్లో మినహా మిగతా వాటిలో సాధారణంగా 24 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటారు. వజ్రాల నగ కేవలం 18 క్యారెట్ల బంగారంతో మాత్రమే ఉంటుంది. కొందరు వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని వినియోగదారులకు విక్రయించి 22 క్యారెట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. 22 క్యారెట్లు, 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.700 వరకు తేడా ఉంటుంది. ఈ లెక్కల కనీసం 10 గ్రాములకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు నష్టం తప్పదు. బంగారం తూచే ఎలక్ట్రానిక్ కాంటాల వెనుక త్రాసును నియంత్రించే వీల్స్ బేరింగ్‌లను మార్పు చేసే అవకాశం ఉంటుంది. బంగారం నాణ్యతను తెలిపే మెషిన్ లేకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు.

నగరంలో రెండు చోట్ల అగ్నిప్రమాదాలు

-నార్సింగిలోని ఫర్నీచర్ గోదాములో అగ్నిప్రమాదం
- పరుగులు తీసిన అపార్టుమెంట్ వాసులు

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫర్నీచర్ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదం దృశ్యాలు.

నార్సింగి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : షార్ట్ సర్క్యూట్ వలన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ఓ ఫర్నీచర్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఏకంగా 20.అడుగుల ఎత్తు వరకు మంటలు ఎగిసిపడ్డాయని స్థానికులు తెలిపారు. ఈ మంటల వేడికి పక్కనే ఉన్న అపార్టుమెంట్ ఏసీల కంప్రెసర్‌లు కాలిపోయాయి. రెండు కార్లు కూడా ధ్వంసం అయ్యాయి. ఎగిసిపడుతున్న మంటలను చూసి అపార్టుమెంట్ వాసులు పరుగులు తీశారు. పుప్పాలగూడ గీతాంజలీ పాఠశాలకు సమీపంలో మలేషియా సోఫాసెట్ ఫర్నీచర్ గోదాంను ఏర్పాటు చేశారు. దీన్ని ఏర్పాటు చేస్తున్న సమయంలోనే స్థానికులు జనావాసాల మధ్య ఈ గోదం పెట్ట వద్దని అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. కానీ అధికారులు పట్టించుకోలేదు. అధికారుల అలసత్వం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, మేము వద్దని చెప్పినప్పుడే గోదాంకు అనుమతి రద్దు చేసి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను ఆర్పివేశారు. పట్టపగలు ఈ అగ్ని ప్రమాదం జరుగడంతో అందరం అప్రమత్తమై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశామని, అదే రాత్రి సమయంలో అయ్యి ఉంటే భారీ ఎత్తున ప్రాణ, ఆస్థి నష్టం వాటిల్లేదని స్థానికులు వాపోయారు. అధికారులు తమ బాధ్యతలను సరిగ్గా నిర్వహించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, మా విన్నపాలను బుట్టదాఖలు చేసిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్లాస్టిక్ స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం..

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త మైసమ్మగూడ ప్రాంతంలో గల ప్లాస్టిక్ స్క్రాప్ గోదాంలో సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు మంటలు చెలరేగిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు చుట్టు పక్కలవారు గమనించి పోలీసులకు, ఫైర్ సిబ్బందికి తెలియజేయడంతో, వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని, సాయంత్రం సుమారు 5:30గంటలకు మంటలను అందుపులోకి తీసుకురావడం జరిగింది. మంటలు చెలరేగిన సమయంలో ఏవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని, ఆస్తి నష్టం సుమారు 30లక్షలు వరకు ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. ప్లాస్టిక్ గోదాంలో రీసైక్లింగ్ కొరకు వాడే బాయిలర్ సిలిండర్ వల్ల లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు సంభవించి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. గోదాం యజమాని కిరణ్ అగర్వాల్ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అగ్నికి ఆహుతి అయిన ప్లాస్టిక్ స్క్రాప్ గోదాం

హైడ్రాకు ఫిర్యాదులన్నీ " పార్కుల కబ్జాలపైనే "

-కాలనీ అసోసియేషన్ల పేరుతో కబ్జాలు చేస్తున్నారని ఆరోపణ
-వివిధ ప్రాంతాల నుంచి ప్రజావాణికి వెల్లువెత్తున్న ఫిర్యాదులు
-కోర్టులో ఉన్న అంశాలను ఫిర్యాదులో పేర్కొనాలన్న హైడ్రా



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అడిషనల్ డైరెక్టర్ పాపయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించి పలు లే ఔట్లలో కేటాయించిన స్థలాలను అక్కడి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులే కబ్జాలు చేస్తున్నారని.. పలువురు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్(ఫైర్)పాపయ్య ఫిర్యాదులు స్వీకరించారు. కాలనీ రహదారులను కూడా వదలకుండా.. ముందుకు జరిగి ప్రహరీలు నిర్మిస్తున్నారని ప్రజావసరాలకోసం దాతలు ఇచ్చిన భూములను కూడా వదలడంలేదని అందుకు ఇందిరా పార్కు కబ్జాలే నిదర్శనమని తెలిపారు. దాదాపు 76 ఎకరాల ఇందిరా పార్కులో పింగళి వెంకట్రామిరెడ్డి విరాళంగా ఇచ్చిన భూమి కొంత ఉందని విద్యుత్ సబ్ స్టేషన్, చెత్త డంపింగ్ యార్డు, స్నో వరల్డ్‌కు ప్రభుత్వం కొంత భూమిని కేటాయించగా.. మిగతా భూమిని వ్యాపారులు కబ్జా చేస్తున్నారని ఇందిరాపార్కు మార్నింగ్ వాకర్స్ ప్రతినిధులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. అలాగే ఎన్‌టీఆర్ గార్డెన్ కూడా నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర మండలం అహ్మద్‌గూడ గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ శ్మశానవాటికలో కొంత భాగంతో పాటు.. నాలా బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టారని ఆ గ్రామప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం అంతియాపల్లి గ్రామంలో చెట్టు కుంట చెరువును కబ్జా చేస్తున్నారని ఆ చెరువును కాపాడాలని హైడ్రాను కోరారు. దుండిగల్ మున్సిపాలిటీ, బహుదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో పార్కులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాలు ప్లాట్లుగా మారుతున్నాయని అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. కోర్టులో ఉన్న అంశాలను ఫిర్యాదులో తప్పనిసరిగా పేర్కొనండి..

హైడ్రా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నప్పుడు.. ఆ సమస్యలకు సంబంధించిన అంశాలు సివిల్, హైకోర్టులో పెండింగ్ ఉంటే.. ఆ వివరాలను ఫిర్యాదులో తప్పకుండా పేర్కోవాలని హైడ్రా కోరింది. సివిల్, హైకోర్టులో పెండింగ్ కేసుల వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచి పెట్టిన పక్షంలో ఫిర్యాదుదారులపై చర్యలుంటాయని హైడ్రా హెచ్చరించింది. వ్యక్తిగత వివాదాలు లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న సమస్యలను హైడ్రా పరిష్కరించదని. ప్రభుత్వ భూములతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలకు సంబంధించిన అంశాలనే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని హైడ్రా ప్రజలను కోరింది.

సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయొద్దు

-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆదేశం

ప్రజావాణిలో ఆర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఇలంబర్తి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త: సీనియర్ సిటీజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయరాదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం దిశగా సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయకుండా త్వరితగతిన కార్డులు జారీ చేయడంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాలకు సంబంధించిన ఆర్జీలను వేగవంతంగా పరిష్కరించడం పై దృష్టి సారించాలని సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 82 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 46, శానిటేషన్ విభాగానికి 5, ట్యాక్స్, హెల్త్ విభాగాలకు 4 చొప్పున, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు 3 చొప్పున, ఎఫ్.ఏ, ఎలక్ట్రికల్, ల్యాండ్ అక్విజిషన్, సిపిఆర్ఓ, యు.బి.డి విభాగాలకు 2 చొప్పున, హౌసింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 6 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి రావు,సి సిపి శ్రీనివాస్,, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, అడిషనల్ సి.సి.పి లు ప్రదీప్, గంగాధర్, వెంకన్న,రంజిత్ కుమార్,వాటర్ వర్క్స్ జోనల్ మేనేజర్ సాయి రమణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్, యు బి డి డైరెక్టర్ వెంకటేశ్వరరావు, యుసిడీపీడి దేవేందర్ రెడ్డి, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, జె.సి రెవెన్యూ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈ పనస రెడ్డి ఇరిగేషన్ ఈఈ నారాయణ పాల్గొన్నారు.

విద్య బలమైన ఆయుధం : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

విద్య బలమైన ఆయుధమని ఈ ఆయుదాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం కూకట్ పల్లి మండలంలోని ఎల్లమ్మ బండలో అక్షయ విద్య కమ్యూనిటి లెర్నింగ్ అండ్ స్కిల్స్ ట్రైనింగ్ సెంటర్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఈ కమ్యూనిటి హాల్‌లో చిన్నారులకు అవసమైన మౌళిక వసతులు ఏర్పాటు చేసారన్నారు. చిన్న చిన్న ప్రైవెటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1 నుండి 6 వతరగతి చిన్నారులకు ప్రతిరోజు సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు ఉచితంగా ఇక్కడ చదువు చెప్పడం ఎంతో హర్షనీయమని గవర్నర్ అన్నారు. ఈ ప్రాంతంలో ఇంటర్ డిగ్రీ చదువుకునే విద్యార్థులే వీరికి పాఠాలు చెప్పడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ సెంటర్‌ను నిర్వహిస్తున్న అక్షయ ఫౌండేషన్ వారికి గవర్నర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం, అక్షయ పౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లో గొంతు కోసుకుని ఆత్మహత్య

సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః ఒవ్యక్తి బాత్‌రూమ్‌లోకి వెళ్లిగొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన నర్సింగ్‌రావు మాసబ్‌ట్యాంక్‌లోని పవర్‌గ్రిడ్‌లో విధలు నిర్వహించేవాడు. సోమవారం ఉదయం బాత్‌రూమ్‌లోకి వెళ్లి గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో యువతి ఆత్మహత్య

చార్మినార్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం..బీదర్‌కు చెందిన ఖాజా మున్నా భార్యా,పిల్లలతో కలిసి కిషన్‌బాగ్‌లోని అసద్ బాబానగర్‌లో నివాసం ఉంటున్నాడు.కార్మికుడిగా ఖాజా మున్నా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.కాగా ఖాజా మున్నా కుమార్తె ఖతీజా (22)కు పద్దెనిమిది నెలలు క్రితం ఓ యువకుడితో నిశ్చితార్థం జరిగింది.ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండటంతో వారి వివా హం వాయి దా పడుతున్నది.దీంతో జీవితంపై విరక్తి చెందిన ఖతీజా ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడింది.ఈ కేసును బహదూ ర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-లేబర్ అడ్డాలు, కార్మికులు పనిచేసే చోట తాగునీరు ఏర్పాటు చేయాలి
-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త: రానున్న రోజుల్లో వేసవిలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎండల తీవ్రత, జాగ్రత్త చర్యలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని రానున్న వేసవిలో కార్మికులు, ప్రజలు ఉష్ణోగ్రతల వల్ల ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. లేబర్ అడ్డాలు, పని ప్రదేశాలను గుర్తించి తాగునీరు అందుబాటులో ఉంచాలని, అన్ని బస్తి, పీహెచ్సీ, సిహెచ్‌సిలల్లో అనుకున్న దానికంటే 200 అధికంగా ఓఆర్ ఎస్ ప్యాకెట్లను నిల్వ ఉండేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, ఉపాధి, కార్మిక శాఖలు కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని అన్నారు. పీహెచ్‌సిల వారిగా కన్సక్షన్ సైట్స్ లను గుర్తించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ వసతి గృహాలలో ఎండ తీవ్రత పై అవగాహన కల్పించాలని,ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రజలు ఏమి చేయాలో ఏమి చేయకూడదో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, ఈడిఎస్‌సి కార్పొరేషన్ రమేష్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేమింతే...!

-అవినీతి హబ్‌గా రాజేంద్రనగర్ సర్కిల్ ఆఫీస్!
-అధికారుల పనితీరుతో భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి
-పలువురు అధికారులు ఎసిబికి చిక్కినా మారని తీరు
- ఎసిబి మరింత నిఘా పెంచాలి

అత్తాపూర్ ఫిబ్రవరి 24,ప్రభాతవార్త : నగరంలో పలు జిహెచ్ఎంసి కార్యాలయంలో పలువురి అధికారులపై ఎసిబి అధికారులు దాడులు జరిపి పట్టుకున్నప్పటికి అధికారుల్లో మార్పు రావడం లేదని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయంలో అవినీతి విచ్చలవిడిగా పెరుగుపోతుందని సర్కిల్‌పరిధిలోని ప్రజలనుంచి ఆరోపణలు వెల్లువలా వస్తున్నాయి.ఓ వైపు విమర్శలు ,మరోవైపు ఆరోపణలు వినిపిస్తున్నా మనం చేయాల్సిన పనిలో ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదు. అన్నట్లుగా రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు పెరిగిపోతున్నాయి. ఇందులో టౌన్ ప్లానింగ్,ట్యాక్స్ కలెక్షన్ ,ఇంజనీరింగ్ విభాగం తదితర శాఖల అవినీతిలో తాము ఏమాత్రం తక్కువ కాదంటూ ఓ శాఖతో మరో శాఖ పోటి పడుతున్నట్లుగా ఉంది.అన్ని శాఖల్లోనూ అమ్యామ్యాలకు అలవాటు పడ్డ అధికారులు జనాలను పీల్చి పిప్పి చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.అధికారులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతునాఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.దీంతో జిహెచ్ఎంసి అధికారులపై ఉన్నతాధికారులు నిఘా పెంచాలని సర్వత్రా డిమాండ్ పెరుగుతోంది.

ఎసిబి దాడులు జరిగినా ఐ డోంట్ కేర్ : జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాలలో ఎసిబి దాడుల్లో అధికారులు పట్టుబడినా ఏ మాత్రం చలనం రావడం లేదు.ఎసిబి దాడులు జరుగుతుంటాయి. పోతుంటాయి ఐ డోంట్ కేర్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో గత ఏడాది ఓ ఎఈ సిసి రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపుల విషయంలో 15 వేలు రూపాయలు డిమాండ్ చేసి ఎసిబికి పట్టుబడిన సంఘటన మరవకముందే తాజాగా సోమవారం ఓ పరిశ్రమకు సంబంధించి ఆస్తి పన్ను పెంచకుండా ఉండేందుకు బిల్ కలెక్టర్ మధు లక్ష రూపాయలు డిమాండ్ చేయగా ప్రైవేట్ అసిస్టెంట్ రమేష్ ద్వారా 45 వేల రూపాయలు తీసుకుంటున్న సందర్భంలో ఎసిబి అధికారులు పట్టుకున్నారు.

విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు : ఇళ్ల నిర్మాణాలకు పారదర్శకంగా పర్మిషన్లు ఇస్తామని ప్రభుత్వం చెప్తుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో అధికారుల చేయి తడపనిదే పనికావట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.రాజేంద్రనగర్ పరిధిలో విచ్చలవిడి అక్రమ నిర్మాణాలు చకచక సాగుతున్నాయి. ఇచ్చిన అనుమతులకంటే ఎక్కువ ఫోర్లు నిర్మాణాలు చేపడుతున్న అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిహెచ్ఎంసిలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి తగ్గించడానికి ప్రభుత్వం ఎంత ప్రయత్నిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది కనిపించడం లేదు. దీంతో జిహెచ్ఎంసి అధికారుల పనితీరుతో మున్సిపాలిటీఆధాయానికి భారీగా గండిపడుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నాతాధికారులు నిఘా పెంచాలి : రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో గతంలో పనిచేస్తున్న ఎఈ ఓ కాంట్రాక్టర్ వద్ద డబ్బుల తీసుకుంటు ఎసిబి చిక్కడంతో అవినీతి బయటపడింది.అది మరవకముందే మళ్లీ బిల్ కలెక్టర్ ఎసిబి చిక్కడంతో జిహెచ్ఎంసి కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులపై ఎసిబి అధికారులు మరింత నిఘా ఉంచాలని దీంతో మరికొంత మంది అవినీతిపరులు బయటపడే అవకాశం ఉందని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.

పేద ప్రజలకు ఎంతో మేలు : ఎమ్మెల్యే తలసాని

మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరంలో వైద్య పరిక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని.

బేగంపేట ఫిభ్రవరి 24,ప్రభాతవార్త

ఉచిత వైద్య శిభిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట డివిజన్ కుర్మ బస్తీలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరిక్ష శిభిరాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈశిభిరంలో ఎమ్మెల్యే తలసాని బీపీ పరిక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అధికంగా నివసించే బస్తీలలో నిర్వహించే ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ప్రింటర్స్‌డే సందర్భంగా ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్, అరుణా గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్‌కుమార్, నాగులు, పబ్బా ప్రకాష్, చంద్రప్రకాష్, మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు జలంధర్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలు క్రీడల్లో పాల్గొనడం అవసరం

క్రీడల్లో పాల్గొన్న పెన్షనర్స్ మహిళలు. చిత్రంలో శివసేనరెడ్డి, శోభారాణి, ఉమాదేవి తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌కు ఆటల పోటీలు ఉత్సహంగా సోమవారం ఎల్‌బి స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలను తెలంగాణ ఉమెన్ కో-ఆపరేటివ్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ బండ్రు శోభారాణితో కలిసి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి ఛైర్మన్ శివసేనరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో ఫాస్ట్ వాక్, మ్యూజికల్ ఛైర్, స్పీడ్ రన్నింగ్ జరిగాయి. ఈ సందర్భంగా శివసేనరెడ్డి మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా క్రీడల్లో మహిళలు పాల్గొనడం ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ క్రీడల్లో క్రియాశీలకంగా పాల్గొనడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా పెన్షనర్స్ ఫోరం ఛైర్ పర్సన్ ఆర్.ఉమాదేవి, కోర్ ఛైర్ పర్సన్ కె.ధనలక్ష్మి, కన్వీనర్ ఎస్ఎం ఎల్ నాగమాంబ, జూపాక సుభద్ర, పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మయ్య, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సుధాకర్ పాల్గొన్నారు.

బిసి పాలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో పారిశ్రామిక విభాగం ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: బిసి పారిశ్రామిక వేత్తలను ఒకే తాటిపైకి తీసుకు వచ్చేందుకు బిసి పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో పారిశ్రామిక విభాగాన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర జెఎసి ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ తెలిపారు. బిసిలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఈ విభాగం పనిచేస్తుందని, రాష్ట్ర అధ్యక్షునిగా దామోదరచారిని అయన నియమించి, నియామకపత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న రాయితీలు, రిజర్వేషన్‌లు బిసి పారిశ్రామిక వేత్తలకు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని సందర్భంగా గుర్తు చేశారు. బిసి పారిశ్రామిక వేత్తలు బసి యువతకు ఉపాధి కల్పించాలని, కోరారు. ఈ సమావేశంలో కాప్రా స్మాల్ స్కేల్ ఇండ స్ట్రీస్ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శి హీరాలాల్, సభ్యులు బలు, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి

దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమైన జిఎం.అరుణ్‌కుమార్ జైన్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రైల్వే కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించడానికి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సూచించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో వివిధ జోన్లకు సంబంధించిన రైల్ కార్యకలాపాల భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సేఫ్టీ డ్రైవ్ స్థితిని ఆయన పరిశీలించారు. ఏమైన లోపాలు ఉంటే వీలైనంత త్వరగా సరి చేసుకోవాలన్నారు. లోక్‌ఫైలెట్లు, అసిసెంట్ లోకో ఫైలెట్లు, గార్డులు, ట్రాక్ మిషన్ ఆపరేటర్లు, టవర్ వ్యాగన్ ఆపరేటర్లు, భద్రతా సిబ్బందికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. రైళ్ల నిర్వాహనలో భద్రతను నిర్ధారించడానికి విధి విధానాలను పాటించాలన్నారు. పొగను నిర్ధారించ పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు, అగ్ని నిరోధక భద్రత వస్తువుల స్టాక్ నిల్వ స్థానాన్ని కూడా పరిశీలించాలన్నారు. సిబ్బందికి సరైన విశ్రాంతి ఇవ్వడానికి ప్రణాళిక చేయాలని డి.ఆర్.ఎం.లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్‌తో పాటు హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూర్, నాందేడ్ డివిజన్ల డిఆర్ఎంలు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలో అలీజా బుఖారీకి ప్రథమ స్థానం

చార్మినార్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : మదీనా సమీపంలోని మహ్మద్ క్యాప్ మార్ట్ ఎండి మహ్మద్ ఇలియాస్ బుఖారీ మనమరాలు అలీజా బుఖారీ (గ్రేడ్2సి) ఖాజాగూడ ఓక్రిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఫెస్ట్ (2024-25) సందర్భంగా నిర్వహించిన స్కేటింగ్ పోటిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహ్మద్ ఇలియాస్ బుఖారీ మాట్లాడుతూ తన కొడుకు ఇషాక్ బుఖారి కూతురు అలీజా బుఖారీ స్కేటింగ్ పోటిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

విఎన్ఆర్ విజేఐఈటిలో ముగిసిన సాంకేతికోత్సవం కన్వర్జెన్స్ 2K25

నిజాంపేట్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో కన్వర్జెన్స్ 2K25 పేరిట వార్షిక సాంకేతికోత్సవం ముగిసింది. ఈ వేడుక ముగింపు సభలో ముఖ్య అతిథిగా టిసిఎస్ సంస్థలో ప్రధాన కన్సల్టెంట్, డిజిటల్ ఉపక్రమణాల సాంకేతికత అధిపతి పెద్దిగారి బాలప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతాభివృద్ధి అతి వేగంగా రూపాంతరం చెందుతున్న కాలమిదని, విద్యాసంస్థలు తమ విద్యార్థులను, అధ్యాపకులను కూడా ఈ పెనుమార్పులను అందుకునేలా సన్నద్ధం చేయవలసిన అవసరముందని అన్నారు. కన్వర్జెన్స్ వేడుకను పేరుకు తగినట్టుగా వివిధ సాంకేతికతల కలయికకు వేదికగా 25 యేళ్ళకి పైగా నిర్వహిస్తున్నందుకు విఎన్ఆర్ విజేఐఈటీ యాజమాన్యాన్ని, విద్యార్థులను, నిర్వాహకులను ఆయన అభినందించారు. విద్యార్థి పురోగతి డీన్ ఆచార్య డా.వై. పద్మశాయి మాట్లాడుతూ వివిధ కార్యశాలలు, హ్యాకథాన్, క్యాడథాన్, కోడింగ్ కాంటెస్ట్, ప్రాజెక్ట్ కాంటెస్ట్, క్యాంపస్ ఆటోమేషన్, సరదా పోటీలు, సమాజహిత కార్యక్రమాల వంటి వివిధాంశాల సమాహారంగా జరిగిన రెండు రోజుల టెక్నికల్ సింపోజియంలో నగరంలోని వివిధ కళాశాలల నుంచే కాక ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా విద్యార్థులు వచ్చి పాల్గొన్నారని తెలిపారు. తదనంతరం కళాశాల ప్రధానాధ్యాపకులు ఆచార్య డా. సి.డి. నాయుడు మాట్లాడుతూ ఈ వేడుకలు అందించిన ప్రేరణతో విద్యార్థులు ఈ రెండు రోజుల్లో రూపొందించిన సృజనాత్మక సాంకేతిక పరిష్కారాలను కళాశాలలోని పరిశోధన, నవకల్పన కేంద్రాల ద్వారా మరింత అభివృద్ధి చేసి విజ్ఞాన జ్యోతి నుంచి మూలధనంతో అంకురసంస్థలుగా రూపొందించవచ్చని అన్నారు, ఇదే ప్రాంగణంలో ఉన్న విజే హబ్ ద్వారా వచ్చే సహకారంతో విద్యార్థులు స్టార్టప్ సమారంభకులుగా ఎదగవచ్చని ప్రోత్సహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనటం ముదావహమన్నారు. ఈ అవకాశానికి బాటలు వేసిన వారి జిజ్ఞాస ఒక విత్తనంగా మొలకెత్తి, పచ్చని భవిష్యత్తుకు చిగురు తొడగనుందని కళాశాల సంచాలకులు ఆచార్య డా. బి. చెన్నకేశవరావు ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. కన్వర్జెన్స్ 2K25 ముగింపు వేడుకల్లో కళాశాలకి చెందిన విద్యార్థి కూటములు క్రెసెండో, లైవ్వెర్ తమ సంగీత నృత్య ప్రదర్శనలతో ఆహూతులను అలరించాయి.

సాంకేతికోత్సవం కన్వర్జెన్స్ 2K25లో పాల్గొన్న విద్యార్థులు

హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలి : ఎమ్మెల్యే తలసాని

కంటోన్మెంట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః

సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీలో అన్ని సౌకర్యాలతో కూడిన నూతన హాస్పిటల్ నిర్మించాల్సిన అవసరం ఉన్నదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించిన సందర్భంగా ఎస్ఆర్‌టీలో ఉన్న డిస్పెన్సరీకి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు తగిన విధంగా సౌకర్యాలు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫోన్ చేసి డిస్పెన్సరీకి పక్కనే జీహెచ్ ఎంసీకి చెందిన స్థలం ఉన్నదని, ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు కేటాయించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్పిటల్ భవన నిర్మాణం కు అవసరమైన నిధులు 1.43 కోట్ల రూపాయలు ఇప్పటికే మంజూరై ఉన్నాయని వివరించారు. నూతన హాస్పిటల్ భవనం నిర్మిస్తే మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఎంఈఓ హరిచంద్ర, కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బాల్ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఎఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి, నాయకులు ఖలీల్, సురేష్ గౌడ్, శేఖర్, ఫాజిల్, జమీర్, పుష్పాలత ఉన్నారు.

సెల్ టవర్ తొలగించాలి....

సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీ 707లో నూతనంగా ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ టవర్‌ను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. సోమవారం సనత్‌నగర్ పర్యటనకు వచ్చిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు.

తాము మొదటి నుండి కోరుతున్నా అధికారులు పట్టించుకోకుండా సెల్ ఫోన్ టవర్‌ను ఏర్పాటు చేశారని, దీని వలన తాము అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి టవర్ తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ బందోబస్తు

-బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
-సిపి సుధీర్ బాబు

నేరేడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, ఫిబ్రవరి 24ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సావాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు మరియు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్ల గురించి రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ గారు బందోబస్తు విధుల్లో ఉన్న సివిల్, ట్రాఫిక్ మరియు ఇతర విభాగాల అధికారులు మరియు సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గారు మాట్లాడుతూ బ్రహ్మోత్సావాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల భద్రతా పరమైన పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, విఐపీలతో పాటు సాధారణ భక్తులకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు మరియు సిబ్బంది తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్సును, బీపీ షుగర్ వంటి వాటితో పాటు ఇతర అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు.

భక్తులతో పాటు బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది యొక్క క్షేమం కూడా తమకు అంతే ముఖ్యమని, పోలీసు సిబ్బంది అనుకోని పరిస్థితుల్లో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అంతేకాకుండా ప్రత్యేక వైద్య చికిత్స తీసుకుంటున్న సిబ్బందికి అవసరమయ్యే మందులు కూడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరుతో పాటు వేసవి తాపానికి కొందరు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా ఏర్పాటు చేసిన సిసిటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీం బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. భారీసంఖ్యలో భక్తులు దైవదర్శనం కోసం వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి డిసిపి పివి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, ఐటి సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈశ్వరీబాయి సేవలు మరువలేనివని

ప్రొఫెసర్ లారెన్స్ సైమన్‌కు ఈశ్వరీబాయి స్మారక అవార్డును ప్రదానం చేస్తున్న ప్రముఖులు

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: నిరుపేద కుటుంబంలో జన్మించిన మాజీ శాసన సభ్యురాలు, ఆర్‌పిఐ మాజీ అధ్యక్షురాలు, దళిత మహిళా నేత జె.ఈశ్వరీబాయి దళితులు, నిరుపేదల కోసం ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్వంలో సోమవారం రవీంద్రభారతిలో జరిగిన జె.ఈశ్వరీబాయి 34వ వర్ధంతి సభలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఛైర్ పర్సన్ ఆలేఖ్య పుంజాల, తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్ పర్సన్ వెన్నెల గద్దర్, విశ్రాంత ఉన్నతాధికారి పి.ఎస్.ఎన్. మూర్తి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ, దళిత సేన జాతీయ అధ్యక్షుడు జె.బి.రాజు ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లో తనదైన ముద్రవేశారని, ఈశ్వరీబాయి ఫైర్ బ్రాండ్‌గా పేరుగాంచారని వారు చెప్పారు. ఆమె సేవలు అద్భుతమని, నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. దళితులు, పేదల కోసం ఆనేక పోరాటాలు నిర్వహించారని, తెలంగాణ తొలి ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించారని వారు ఈ సంద ర్భంగా గుర్తు చేశారు. అంతకు ముందు ఆమె చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి స్మారక అవార్డును ప్రముఖ సంఘ సేవకులు ప్రొఫెసర్ లారెన్స్ సైమన్‌కు అతిథులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ జె.గీతారెడ్డి, ట్రస్ట్ వైస్-ఛైర్మన్ డాక్టర్ రామచం ద్రారెడ్డి, పల్లె నాగేశ్వర్, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు గంటా మల్లేష్, ఆర్‌పిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌బాబు, దళిత నేతలు గోల్లపల్లి దయానందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

-తలకోల పురుషోత్తంరెడ్డి

మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న పురుషోత్తంరెడ్డి, విజయ్‌కుమార్, రాజిరెడ్డి, రేఖారావు తదితరులు

హైదరాబాద్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

పటిష్టమైన విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్ ఎంఎల్ సి స్వతంత్ర అభ్యర్థి తలకోల పురుషోత్తం రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని పలువురు విద్యావేత్తలు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లోని మీడియా సమావేశంలో తలకోల పురుషోత్తం రెడ్డి తన వ్యక్తిగత ఎన్నికల మేనిఫెస్టో 2030 ను విడుదల చేశారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్ యూనియన్ మాజీ కార్యదర్శి డా.బి.విజయ కుమార్, డా.ఈ. రాజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖా రావు, ఐబిసి ఆర్టర్ ఛైర్మన్ ఏచూరి బాస్కర్, రుద్ర రాజేశ్ మాట్లాడారు. పాత పెన్షన్ పథకం పనరుద్ధరణ. సిపిఎస్ రద్దు పిఆర్ సి ప్రకారం 53శాతం ఫిట్మెంట్ అమలు, డిఎ చెల్లింపు,అవుట్ సోర్స్, ఒప్పంద ఉపాధ్యాయుల ప్రామాణీకరణ, పారదర్శక వర్సిటీ నియామక విధానం. ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, లైబ్రరీల స్థాపితం, ప్రైవేట్ ఉపాధ్యాయ సంక్షే మం, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సంక్షేమ బోర్డు ఏర్పాటు, విద్యార్థులకు ఉచిత విద్య ప్రోత్సాహకాలు, నైపణ్యాభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ వంటి అంశాలను ఎజెండాలో పొందుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు.

బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్‌పై ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు

నార్సింగి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ భవన నిర్మాణందారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు హరీష్‌గౌడ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దాన కిషోర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ కమీషనర్ ప్రజల పట్ల అమానూషంగా ప్రవర్తిస్తున్నాడని, ఇష్టానుసారంగా పన్నులు వేస్తున్నాడని, చెరువులు, నాలాలపై భవనాలు నిర్మించేందుకు అనుమతులు ఇస్తున్నాడని ఆరోపించారు. పాలకవర్గ సభ్యుల కాలం ముగిసిన తరువాత కమీష్‌నగర్ ఇష్టాసనుసారంగా వ్యవహరిస్తున్నాడని, నియంతలా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఇలాంటి కమీషనర్, టౌన్‌ప్లానింగ్ టీం అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని ప్రిన్సిపాల్ సెక్రెటరీని కోరడం జరిగిందన్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో అనేకమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా కమీషనర్ పట్టించుకోకుండా అక్రమ నిర్మాణం దారులకే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అడ్డగోలుగా పన్నులు వేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కట్టలేక అవస్థలు పడుతున్నారన్నారు. చట్టానికి లోబడి పని

బండ్లగూడ కార్పోరేషన్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దాన కిషోర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేత హరీష్‌గౌడ్.

చేయాల్సిన కమీషనర్, చట్ట విరుద్దంగా వెలుస్తున్న నిర్మాణాలకు అండగా నిలుస్తున్నాడని, వారి వద్ద అందిన కాడికి దండుకుంటున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరామని, చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తాని హరీష్‌గౌడ్ స్పష్టం చేశారు.

4 రోజులు ఎన్ఎపిఎం మహాసభలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (ఎన్ఎపిఎం) 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ నాయకులు మేధావులతో మార్చి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మహాసభలు నిర్వహిస్తున్నామని హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రముఖులు వి.సంధ్య, సజయ, మీరా, కన్నెగంటి రవి, విస్సా కిరణ్, వెంకటస్వామి, పవిగా బేగంతో పాటు ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన మేధావులు, ప్రముఖ జాతీయ నాయకులు హాజరవుతారని చెప్పారు. సహజ వనరులు, ప్రజల హక్కులు, రాజ్యంగ విలువలను కాపాడే విధంగా ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక పోరాడుతుందన్నారు. మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడాన్ని వి.సంధ్య, సజయ పూర్తిగా వ్యతిరేకించారు.

లబ్దిదారులకు షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

షాదీముబార్ చెక్కును అందజేస్తున్న తాహశీల్దార్ నయూముద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.

యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. సోమవారం షాదీముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్దిదారులకు సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్, ఖైరతాబాద్ తాహశీల్దార్ నయూముద్దీన్‌లతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి విషేషంగా కృషి చేస్తున్నారని పేద ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.

బోరబండ డివిజన్‌లో.....

బోరబండ డివిజన్‌కు చెందిన లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరార్, ఖైరతాబాద్ తహశీల్దార

సైబర్ నేరాలు,ఈవ్‌టీజింగ్‌లపై విద్యార్థులకు అవగాహన

కళాసీగూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎసిపి సర్ధార్ సింగ్.

బేగంపేట ఫిభ్రవరి 24,ప్రభాతవార్త

సైబర్ నేరాలపూ విద్యార్థులు,వారి తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మహంకాళీ ఏసీపీ సర్ధార్ సింగ్ పిలుపు నిచ్చారు.సికింద్రాబాద్ కళాసీగూడలెని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహంకాళీ ఇన్స్ పెక్టర్ కె.పరుశురాం ఆధ్వర్యంలో ఈవ్‌టీజింగ్,సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ సర్ధార్ సింగ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పాఠశాలల్లో విధ్యార్థులు ఈవ్‌టీజింగ్ వంటి వాటికి పాల్పడకూడదన్నారు.అలాగే డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.కార్యక్రమంలో మహంకాళీ ఇన్స్ పెక్టర్ కె.పరుశురాం, ఎస్సై ఎండీ గౌస్,ఏఎస్సై షరీఫ్ సిబ్బంది,విధ్యార్థులు పాల్గొన్నారు.

ఈశ్వరిబాయి సేవలు అభినందనీయం : మాజీమంత్రి గీతారెడ్డి

ఆశ్వరిబాయి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న గీతారెడ్డి తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః

బడుగు బలహీన వర్గాలవారి సంక్షేమానికి కృషి చేసిన దివంగత నేత మాజీ ఎమ్మెల్యే ఈశ్వరీబాయి 34వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తా సమీపంలోని ఈశ్వరి బాయ్ విగ్రహానికి మాజీ మంత్రి గీతారెడ్డి ఈశ్వరిబాయి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ డి. రామచంద్రారెడ్డి, గీతా మల్టీస్పెశాలిటి ఆస్పత్రి అడ్మినిస్రేటర్ మేఘనారెడ్డి, దళిత నాయకులు బాలరాజు, చెన్నయ్య, మహేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ ఈశ్వరి బాయి దళితుల సంక్షేమానికి సమ సమాజ నిర్మాణానికి ఎన్నో సేవలందించారని, అసెంబ్లీలో తనదైన వాగ్ధాటి పటిమతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు జరిపారని అన్నారు. ఆమే చేసిన సేవలను గుర్తించి ఈశ్వరిబాయి జయంతి, వర్ధింతిని ప్రభుత్వం తరపున నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆమె కుమార్తెగా తాను జన్మించటం సంతోషంగా ఉందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఈ దళిత సంఘాల నేతలు జి శంకర్, జె బి రాజు, ఆస శ్రీరాములు, శంకర్, జి దయానందరావు, అవిలయ్య, వెంకటేష్, మహేష్ బాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌ను పరామర్శించిన తలసాని

కంటోన్మెంట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. గచ్చిబౌలిలోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం హాస్పిటల్‌కు వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకొని సాధారణ జీవితంలోలోకి రావాలని ఆకాంక్షించారు.

డివిజన్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లో ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్ లో ఉన్న డివిజన్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేటర్ కార్యాలయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీ వినయకుమార్ మాట్లాడుతూ వి.వి. గిరి నగర్, ధోభి ఘాట్, మాల బస్తి లతో పాటు పలు చోట్ల షాబాద్ బండల ఏర్పాటు పెండింగ్లో ఉన్నాయని, అలాగే ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన మరిన్ని అభివృద్ధి పనులను అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డిప్యూటీ ఇంజనీర్ గీత,అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, ఇంజినీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

"ఆన్ ద జాబ్ ట్రైనింగ్" కి ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు



కార్యక్రమంలో పాల్గొన్న వివేకానంద ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిబిఎ విభాగం ఆధ్వర్యంలో బిబిఎ రిటైల్ ఆపరేషన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మెక్ డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు సోమవారం కళాశాలలో "ఆన్ ద జాబ్ ట్రైనింగ్" కి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో 13 మంది విద్యార్థులు ఎంపిక కాగా, ఎంపికైన వారికి మూడు సంవత్సరాలు కళాశాల విద్యతో పాటు ఇంటర్న్ షిప్ ఉంటుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. కె. ప్రభు అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిబిఎ విభాగాధిపతి విరాల సంతోషితో పాటు అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

నిజాంపేట్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మయూరి నగర్ సబ్ స్టేషన్‌లోని 11కేవీ కేటీఆర్ కాలనీ ఫీడర్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి 1 గంటల వరకు ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ ఉండదని నిజాంపేట్ ఏఈ తెలిపారు. రాఘవ రెడ్డి కాలనీ, నారాయణరెడ్డి కాలనీ, శ్రీనివాస కాలనీ, కేటీఆర్ కాలనీ, బాలాజీ హిల్స్ కాలనీ, ఫేజ్ 2 బ్లాక్ 1,2,3, బాలాజీ అడోబ్ అవెన్యూ, బాలాజీ ఆదర్శ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కుల గణనతోనే బిసిలకు న్యాయం : నిరంజన్

-లంగర్ హౌస్ డివిజన్‌లో పర్యటన

మెహిదీపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

కుల గణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, కులగణనను నిర్వహించి రిజర్వేషన్ లను పక్కాగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ బీ.సీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ తెలిపారు. కులగణన సర్వేలో ఇప్పటివరకు ఎవరైనా పాల్గొనకపోతే తమ పేర్లను నమోదు చేసుకొని కులగణనకు సహకరించాలని కోరారు. కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ లో సోమవారం తెలంగాణ బీ.సీ కమిషన్, కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు చంటిబాబు ఆధ్వర్యంలో కులగణన సర్వే పై ఇంటింటికి తిరుగుతూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బాపుఘాట్ లోని మహాత్మాగాంధీ సమాధి వద్ద పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించిన అనంతరం బీ.సీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మీడియాతో మాట్లాడారు.. 1931లో ఆంగ్లేయుల కాలంలో జరిగిన కుల గణన తర్వాత తిరిగి మళ్లీ కులగనన ఎప్పుడు జరగలేదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు రూ. 160 కోట్లు విడుదల చేసి ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కులగణన సర్వేతోనే కులాల వారి సంఖ్య తెలవడంతో వారికి రిజర్వేషన్ అమలు చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలంటే తప్పని

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్.

సరిగా కులగణన అవసరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితేనే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ 6వేల కోట్ల రూపాయలు విడుదలైతయన్నారు. లంగర్ హౌస్ డివిజన్ లోని పలు బస్తీలు, కాలనీలలో కులగణన సర్వే పూర్తిగా జరగకపోవడంతో సంబంధిత అధికారులను పిలిపించి ఇంటింటికి తిరుగుతూ కులగనన సర్వే మరల చేయాలని ఆదేశించారు. కుల గణనకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 040 21111111 ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్వా నియోజకవర్గ ఇన్ చార్జ్ ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ అజ్రీ, సీనియర్ నాయకులు కూరాకుల కృష్ణ, శేఖర్, పరమానందం, శ్రీనివాస్, నాగారం వేణు గౌడ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, సంతోష్ గౌడ్, అలీ, గిరి, నరసింహారెడ్డి, వినోద్ సింగ్, షకీలా, హేమలత, వనజ, రవి, వినోద్ చోగ్లే అధికారులు ఆశన్న, శ్రీవాణి, లలిత కుమారి, సంతోషి, పుష్ప, రోజా రాణి, ఇందిరా లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆహ్లాకరమైన వాతావరం కల్పించాలి : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః

స్కూల్‌లలో సరైన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపగలరని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన సనత్‌నగర్ లోని నెహ్రూ పార్క్ సమీపంలో గల రౌండ్ టేబుల్ స్కూల్‌ను విధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ స్కూల్‌లో ప్రైమరీ, హై స్కూల్‌లకు చెందిన సుమారు 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు తరగతి గదులు లేవని ఎమ్మెల్యేకు స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదదండ్రులు వివరించారు. సరిపడా తరగతి గదులు లేని కారణంగా చెట్ల క్రింద, షెడ్ల క్రింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నట్లు తెలిపారు. స్పందించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు అక్కడి నుండే ఫోన్ చేసి రౌండ్ టేబుల్ స్కూల్‌లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేని కారణంగా ఆరుబయట పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయు

పాఠశాల సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

లు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రౌండ్ టేబుల్ స్కూల్‌కు సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఇఎస్ఐకి చెందిన స్థలంలో నూతన భవనం నిర్మించి ప్రైమరీ స్కూల్‌ను ఇందులోకి మార్చాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు గాను 40 లక్షల రూపాయలతో ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ కలెక్టర్‌ను తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

విగ్రహ ప్రతిష్ట ముగింపు ప్రత్యేక పూజలు

పూజా కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః మహేంద్రహిల్స్ రవికాలనీ సాయిశిఖరంలో శ్రీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో నందీశ్వర విగ్రహ ప్రతిష్ట, శ్రీకాశి విశ్వేశ్వర ధ్వజస్థంబ ప్రతిష్టాపన కార్యక్రమాలు ముగిశాయి. వేద పండితుల మంత్రోచ్చారణలతో విగ్రహ ప్రతిష్ట పూజలు ఘనంగా జయిగాయి. ముగింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ ఫౌండర్ కొత్త సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : మాధవి

మామిడి మాధవిని సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు, స్థానిక నేతలు.

మెహిదీపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

కార్వాన్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ మహిళ ఇన్ చార్జ్ మామిడి మాధవి తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ మహిళ ఇన్ చార్జ్ గా మామిడి మాధవి నియమితులు కావడంతో సోమవారం గంగపుత్ర సంఘం సభ్యులు, స్థానిక నేతలు ఆమెకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వీడియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. సన్మానించిన వారిలో స్థానిక నేతలు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, సంతోష్ గౌడ్, గంగపుత్ర సంఘం సభ్యులు కట్ట కుమారస్వామి, కట్ట శ్రీనివాస్, గుండెబోయిన శ్యాంసుందర్, క్రాంతి కుమార్,జయరాం, చంద్రశేఖర్‌లు ఉన్నారు.

యువతిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఫోక్సో కేసు

బేగంపేట ఫిభ్రవరి 24,ప్రభాతవార్త

యువతిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపైన బేగంపేట పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు సమీపంలోని పిడుగురాళ్లకు చెందిన యువతి (19) డిగ్రీ మొదటి సంవత్సరం విధ్యను అభ్యసిస్తుంది.డిసెంబరు 2021లో బేగంపేట ప్రకాష్ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న పీ.ఆర్య(19) యువతికి ఇన్ స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు.వీరిద్దరూ కొంతకాలం పాటు ఇన్‌స్టా గ్రామ్‌లో ఛాటింగ్ చేసుకుని ఆతర్వాత ఒకరినొకరు నేరుగా కల్సుకుని మాట్లాడుకునేవారు.ఈ క్రమంలో యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అందుకోసం మాట్లాడుకుందామని చెప్పి జూన్ 2022లో యువతిని ఆర్యతన ఇంటికి తీసుకుపోయి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు.అదే సంవత్సరం ఆగస్టులో బాధితురాలు గర్భం దాల్చింది.దీంతో పెళ్లి చేసుకుందామని కోరిన బాధితురాలిపై పలుమార్లు యువకుడు దాడికి పాల్పడ్డాడు.గర్భస్రావానికి మాత్రలు వేసుకోవాలని యువతిని వత్తిడి చేసాడు.గతంలో బాధితురాలిపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడిన సమయంలో ఫోటోలు,వీడియోలు తీసిపెట్టుకున్నాడు.తనను విడిచిపెట్టి వెళ్లాలని,లేదంటే ఫోటోలు,వీడియోలు సామాజిక మాధ్యమాలలో అప్‌లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడు.అతని వేధింపులు తట్టుకోలేక బాధితురాలు సోమవారం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు.

మార్చి3న డిమాండ్‌ల సాధనకై ఛలో ఢిల్లీ

ఎం.టి.ఎస్ రాష్ట్ర 4వ ద్వైవార్షిక మహాసభలో పాల్గొన్న నాయకులు

బేగంబజార్,ఫిబ్రవరి 24ప్రభాతవార్త:

అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్చి3వ తేదిన ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జంతర్‌మంతర్‌లో పెద్ద ఎత్తున్న ధర్నా నిర్వహిస్తున్నామని అఖిల బారత తపాల ఉద్యోగుల సంఘం, ఏ.ఐ.పి.ఈ.యు నాయకులు ఆర్.పి.సారంగ్ తెలిపారు. ఈమేరకు ఎం.టి.ఎస్ రాష్ట్ర 4వ ద్వై వార్షిక మహాసభలను తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో ప్రారంభించారు. సి.హెచ్.కుమార్ అధ్యక్షతన 24,25 మహాసభలు మొదటి రోజు నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ బిల్లులను రద్దు చేయాలని,ఎన్.పి.ఎస్,యు.పి.ఎస్ విధానాన్ని రద్దు చేస్తూ,ఓ.పి.ఎస్ విధానాన్ని పున ప్రారంభించాలన్నారు.ఇండిపెండెంట్ డెలివరీ సిస్టంను రద్దు చేయాలని,అదే విధంగా మేకనైజడ్‌కోసం సొంత వాహనాన్ని తీసుకురావాలని ఆలోచన విధానాన్ని రద్దు చేయాలని,పోస్టుమెన్ మీద అకౌంట్ల పేరుతో టార్గెట్ల పేరుతో ఇబ్బందికి గురి చేస్తున్నారని,ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆచరణలో సాధ్యం కాని స్కీమ్‌లను తీసుకుని వచ్చి పోస్టుమెన్‌లను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు మండిపడ్డారు.ఈ విధంగా తపాల శాఖను ప్రైవేటికరణ చేయాలన విధానాన్ని తిప్పికొట్టేందుకుగాను ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.ఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మధు సూధన్‌తోపాటు తపాల ఉద్యోగులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

తలసేమియా రోగుల కోసం రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరానికి హాజరైన యువత

హైదరాబాద్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో తెలంగాణలోనే అతిపెద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. దీనికి చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు ప్రముఖులు హాజరై రక్తదాన శిబిరాన్ని సందర్శించి సహాయ సహకారాలు అందించారు.కాగా ఇక్కడ సేకరించిన రక్త యూనిట్లను తలసేమియా రోగులకు ఉపయోగించబోతున్నారు. టిఎస్‌సిఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ అక్బరుద్దీన్ ఒవైసీ ఇతర అతిథులకు, తెలంగాణలో తలసేమియా పరిస్థితి గురించి, తలసేమియా రోగులకు రక్తం ఎక్కించడానికి రక్తదాతలు ముందుకు రావాల్సిన అవసరం గురించి వివరించారు. ఈమెగా రక్తదానశిభిరంలో టిఎస్‌సిఎస్, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్ అబు ఐమల్‌తో కలిసి 1955 రక్త యూనిట్లను సేకరించారు. సేకరించిన రక్తం నిర్ణీత వ్యవధిలో రక్తమార్పిడి అవసరమైన రోగులకు ఉపయోగించబడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఏ అలీమ్ బేగ్, జాయింట్ సెక్రటరీ అబు ఐమల్ ,వైస్ ప్రెసిడెంట్ రత్నావళి కొత్తపల్లి, డాక్టర్ సుమన్ జైన్, మనోజ్ రూపానీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో రిబ్బన్ 10రన్ టీ షర్ట్,పోస్టర్,మెడల్స్‌ను ఎండో మెట్ రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు డా.బిందారా, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ సీనీనటి డాక్టర్ సాయి, కామాక్షిలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

2025-26 రాష్ట్ర బడ్జెట్లో పెన్షన్ పెంపు కోసం నిధులు కేటాయించాలి

-స్థానిక సంస్థల్లో వికలాంగులను నామినేట్ చేయాలి
మార్చి 1నుండి 30వరకు గ్రామాల్లో సంతకాల సేకరణ
-ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కమిటీ సమావేశం తీర్మానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేస్తూ ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 1నుండి 30వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో సంతకాల సేకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కమిటీ సమావేశం తీర్మానించింది. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్ అధ్యక్షతన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఉద్యమాలు ఉధృతం చేయాలని నిర్ణయం చేయడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయాలని డిమాండ్ చేస్తుంది. తిఐది మ్యానిఫెస్టోలో 2024 పేజీ నెంబర్ 9/8 వికలాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు ఛత్తీస్ ఘడ్లో, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమలు ఉన్న మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకుమార్చి లో జరిగే అసెంబ్లీలో సమావేశాల్లో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల్లో వికలాంగులకు నామినేటెడ్ పదవుల కోసం మార్చి 1నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో సంతకాల సేకరణ చేసి, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సమావేశం నిర్ణయం చేసింది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ 6000 లకు పెంచేందుకు 2025-26 బడ్జెట్లో నిధులు కేటాయించాలని, ఉచిత బస్ సౌకర్యం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ఆర్‌టిసి యాజమాన్యం నడుపుతున్న అన్ని రకాల బస్సులలో వికలాంగుల రాయితీ పాసులను అనుమతించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందని, మెట్రో డీలక్స్, ఏసీ బస్సుల సంఖ్య పెరగడం వల్ల వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరిస్తుంది.మహిళలు, ఒంటరి వికలాంగులను ఆదుకునేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఎన్‌పి ఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శియం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపా ధ్యక్షులు సాయమ్మ,జె రాజు,యశోద, స్వామి, ఉపేందర్, అరిఫా, సహాయ కార్యదర్శులు దశరథ్, గంగాధర్, నాగలక్ష్మి, లింగన్నలతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహుముఖ కార్యకలాపాల కేంద్రం టిపిఎస్‌కె

కార్యక్రమంలో పాల్గొన్న టిపిఎస్‌కె ప్రతినిధులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కె) ప్రజా జీవి తంలోని అన్ని పార్శ్వాలను స్పృశించే బహు ముఖ కార్యకలాపాలకు కేంద్రంగా పని చేయాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. సోమవారం తెలంగాణ ప్రజా సంస్కృతి కేంద్రం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అబ్బాస్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ ఉద్యమాలతోనే ఈ పరిస్థితుల్లో సరిపోదు సామాజిక ,సాంస్కృతిక మేధావులను కూడా ప్రభావితం చేయాలని, బహుముఖ కార్యకలాపాల కేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రంగా ఉండాల న్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, షీరోస్ అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హించాలని, ఈ సమాజంలో హీరో లే కాదు షీరోస్ కూడా ఉన్నారని, పురు షులతో పాటు స్త్రీలు సమానమే అని చాటి చేప్పే కార్యక్రమమని, అన్ని జిల్లా ల్లో నిర్వహించాలని నిర్ణయించారు, మార్చి 23 న భగత్ సింగ్ వర్ధంతి సంద ర్భంగా యువతకు నవతకు సందేశాత్మక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టను న్నట్లు తెలిపారు. ఎప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నుండి వారం రోజులు దళిత బహుజన కార్మిక వీదుల్లో అంబేద్కర్ ఇతర సాంస్కృతిక సంఘాలను కలుపుకొని సాంస్కృతికోత్సవాలు,మేడే సందర్భంగా శ్రామికోత్సవాలు జరుపాలని, శ్రమ సంస్కృతి పై చర్చ వేదికలు నిర్వహించాలని సాంస్కృతిక కార్యకర్తలంతా మూడు నేలల కార్యక్రమాలను జయప్రద చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి రాములు, కార్యదర్శి హిమబిందు. జి.యాదగిరిరావు, కురు మూర్తి,టి రమేష్, నరేష్ శ్రీమన్నారాయణ సాంబరాజు యాదగిరి పాల్గొన్నారు

భవన్స్ కళాశాలలో ఘనంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవం

నేరేడ్‌మేట్ ఫిబ్రవరి 24 , ప్రభాతవార్త : భవన్‌లోని వివేకానంద కళాశాలలో భారతీయ విజ్ఞానం మరియు వారసత్వ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎస్ వి ఆర్ కె చౌదరి అన్నారు. సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్ట్, కల్చరల్ సింగింగ్ పెర్ఫార్మెన్స్, భారతదేశంలోని విభిన్న వారసత్వం, గొప్ప సంప్రదాయాలను హైలైట్ చేశాయి. త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని అత్యంత ఉత్సాహంతో, భక్తితో జరుపుకున్నారు, పురాణ స్వరకర్త సన్యాసి త్యాగరాజును సత్కరించడానికి విద్యార్థులు, అధ్యాపకులు మరియు సాంస్కృతిక ఔత్సాహికులను ఒకచోట చేర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మీనా రాణి, లీనా రెడ్డి, శ్మల్లికా శీను, శైలజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత శిబిరానికి మల్కాజిగిరి డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక

నేరేడ్‌మేట్ ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బికాం ప్రథమ సం. విద్యార్థిని శిరీష ఒడిషా లోని భరంపుర విశ్వవిద్యాలయం నిర్వహించే జాతీయ సమగ్రత శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బండి రాజు తెలియజేసారు. తమ కళాశాల విద్యార్థిని ఒడిశాలో మార్చి 3వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరిగే జాతీయ సమగ్రత శిబిరానికి ఎంపిక కావడం గర్వించదగిన విషయ మన్నారు. ఈ అవకాశాన్ని పొందేందుకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె హరిత ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో తోడ్పడిందన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి అడవి రాజు, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జి ఎన్ జగన్, డాక్టర్ ఇ. ప్రదీప్ , ఐక్యూఎసికో ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్ కుమార్ అకడమిక్ కో ఆర్డినేటర్ గుణాకర్,డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ మల్లిక, పి శైలజ, డాక్టర్ లలిత, డాక్టర్ అహల్య ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

సిసి రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రావణ్

నేరేడ్ మెట్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : మల్కాజ్గిరి డివిజన్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తానని కార్పొరేటర్ శ్రావణ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఆర్ కె నగర్ రోడ్ నెంబర్ 3 లో రూ. 52 లక్షల వ్యయం తో సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలు కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధుల లేమి తో కొట్టుమిట్టడుతున్న జి. హెచ్. ఎం. సి లో ఎంతో కష్టపడి నిధులు మంజూరు చేయించడం జరుగుతుందని అన్నారు. అధికారులు బాధ్యత తో పనులు నాణ్యత తో, సకాలం లో పూర్తి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శివానంద్, మధు, రాంబాబు, హరీష్, ఉపెందర్, జయంతి, సందీప్, మురళి కృష, ఏ. ఈ నవీన్, మహేష్,రమేష్, జైశ్రీరామ్ వేణు, నందు యాదవ్ పాల్గొన్నారు.

దిల్‌షుక్ నగర్ మారుతి మందిర్ చైర్మన్‌గా కిరణ్ కుమార్

చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేస్తున్న చిట్టంవల్లి కిరణ్ కుమార్, ధర్మకర్త గౌని చంద్రయ్య తదితరులు, చిత్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మందడి విజయసింహారెడ్డి

మలక్ పేట,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : దిల్ షుక్ నగర్ మారుతి మందిర్ చైర్మన్ గా ముసారాంబాగ్ కు చెందిన చిట్టీంపల్లి కిరణ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా ఫౌండర్ మెంబర్ గా కనుమూరి సీతారామరాజు, ఆలయ ధర్మకర్తలుగా బి. సంధ్య, గడ్డం నరేందర్ ,బొట్టు శ్రీనివాస్, శ్యామ్ రాజ్, గౌని చంద్రయ్య, ఎక్స్ ఆఫీషియే మెంబర్ గా ఆర్. ప్రహ్లాద శర్మాలు ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్ స్పెక్టర్ కిరణ్, ఇవో రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మందడి విజయసింహారెడ్డి, బద్దం సురేందర్ రెడ్డి, శ్యామ్ రావు, ప్రవీణ్, లక్ష్మణ్, ధర్మేందర్, గోపాల్, సూపర్ వైజార్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత కోసం పాటుపడాలి

మలక్ పేట ,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: జాతీయ సమైక్యత కోసం పాటుపడాలని కెసిఆర్ సేవాదళం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, చావుని డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు హయత్ హుస్సేన్ హబీబ్ పేర్కొన్నారు. నగరంలో జరిగిన ఆల్ ఇండియా మైనార్టీ కౌన్సిల్ వార్షికోత్సవ కార్యక్రమంలో హయత్ హుస్సేన్ హబీబ్ కు నిర్వాహకులు ఏఐఎంసి అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలందరూ ఐక్యమత్యంతో కలిసికట్టుగా ఉండాలని, దీంతో మైనార్టీలు, బీసీల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి దేశ సమగ్రత, ప్రజాస్వామ్యం, సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించుకోవాలి పేర్కొన్నారు. సమాజానికి తమ వంతు సేవలను అందిస్తున్నామని తెలిపారు. రక్తదాన శిబిరాలు, ఉచిత కంటి, దంత తదితర వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో మౌలానా వహీద్ పాషా ఖాద్రి, మౌలానా ఖైరుద్దీన్ సూఫి, సాన ఉల్లాఖాన్, ఏఐఎంసి అధ్యక్షుడు సయ్యద్ మతిన్ అహ్మద్ పాల్గొన్నారు.

రేపు సోమనాథ క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవం

వనస్థలిపురం. ఫిబ్రవరి. 24.ప్రభాతవార్త : వనస్థలిపురం, సోమగిరి లో గల శ్రీ సోమనాథ క్షేత్రంలో ఈనెల 26 బుధవారం మహాశివరాత్రి మహోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు క్షేత్ర కమిటీ నిర్వాహకులు కౌశిక్ మహర్షి,రఘురాములు, సంజీవయ్య లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ సోమనాథ క్షేత్రం లో ప్రతి సంవత్సరం లాగానే వైభవంగా యజ్ఞ యాగాలు,నిర్వహించబడతాయను,మహాశివరాత్రి రోజున అఖండ మహా మృత్యుంజయ యాగం,ప్రసాద వితరణ, రాత్రి మహాన్యాస పూర్వక శత ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహించబడతాయని,భక్తులు అధిక సంఖ్యలో మహాశివరాత్రి ఉత్సవాలలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు తెలిపారు

ఎల్‌బి నగర్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

-పూర్తి ఆరోగ్యంతో ఉన్నా ..ఇక ప్రజల మధ్యనే
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ రెడ్డి

మన్సూరాబాద్,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: ఎల్బీ నగర్ లో అభివృద్ధికి అడగడుగున కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని ప్రారంభానికి సిద్ధంగా ఎన్నో పార్క్ లు ఉన్న ఇంచార్జ్ మంత్రి వస్తేనే ప్రజలకు అందుబాటులో కి తెస్తామనే కుటిల రాజకీయాలకు తెరలేపడం సిగ్గు చేటని స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మండిపడ్డారు . మాన్సూరాబాద్ కె.బి.ఆర్. గార్డెన్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పలు అంశాల గురించి మాట్లాడుతూ 2023 నవంబర్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు, నియోజకవర్గంలో 15 కొత్త పార్కులను మంజూరు చేశామని, అయితే ఎన్నికల నిబంధనల కారణంగా ప్రారంభోత్సవం వాయిదా పడిందని తెలిపారు. కొన్నింటికి కోర్టు వ్యవహారాలు కారణమని, కానీ నేడు మరో 6 పార్కులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఇప్పటికీ 15 నెలలు గడిచినా, కొన్ని పార్కులు ప్రారంభించకుండా తాళాలు వేసి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇంచార్జ్ మంత్రి ప్రారంభిస్తామన్నప్పటికీ, ఇప్పటివరకు కాంగ్రెస్ నాయకులకు అపాయింట్మెంట్ కూడా దొరకలేదా అని ఎద్దేవా చేశారు.ఈ పార్కులు ప్రారంభమైతే తనకు మంచి పేరు వస్తుందని కాంగ్రెస్ నాయకులు భయపడి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. మరో రెండు రోజుల్లో పార్కులు ప్రారంభించకపోతే, తాము స్వయంగా వెళ్లి తాళాలు తెరిచి ప్రజలకు పార్కులను అందుబాటులోకి తీసుకువస్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ నాయకులు నిధులు తేవడంలో విఫలమయ్యారు అని ఎన్నికల ముందు మేము మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూడా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని అన్నారు.గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని స్పష్టం చేశారు.అలాగే కొన్ని కోట్ల రూపాయల నిధులతో కామినేని ఫ్లైఓవర్ క్రింద ఆక్సిజన్ విడుదల చేసే దాదాపు 26 రకాల మొక్కలు దాదాపు 36,000 మొక్కలను నాటించామని,వాటిని ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని గుర్తుచేశారు. నేడు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జోనల్ కమీషనర్ కాంగ్రెస్ పార్టీకి తొత్తుగా మారి కాంగ్రెస్ పార్టీ ఏజెంట్ గా వ్యవహరిస్తున్నారు అని హెచ్చరించారు. జి.ఓ.118 మరియు లారీల అడ్డా విషయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.కొన్ని రోజులుగా తన ఆరోగ్యం బాగోలేక ఇంటివద్దనే ఉండాల్సి వచ్చినప్పటికీ, నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తూనే ఉన్నానని తెలిపారు. ప్రజల ప్రేమ, అభిమానం, ఆశీర్వాదం వల్ల ఇప్పుడు తన ఆరోగ్యం మెరుగైందని పేర్కొన్నారు.అయితే, తన ఆరోగ్యం గురించి ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేశాయని, తనకు కాన్సర్ వచ్చిందని, తిరిగి నియోజకవర్గానికి రారని, బైఎలక్షన్ వస్తుందని ఆశపడ్డారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకుని, అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తనపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,పార్టీ యూత్ అధ్యక్షులు రవి ముదిరాజ్, టంగుటూరి నాగరాజు,జక్కిడి రఘువీర్ రెడ్డి,రుద్ర యాదగిరి, జగదీష్ గౌడ్,విజయ్ భాస్కర్ రెడ్డి,ఆనంద్,సదానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు సిద్ధమైన శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం

శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం

సైదాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సిద్ధమయింది. దేవాలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో నయనానందకరంగా అలంకరణ చేస్తున్నారు. శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలోని మూడు శివాలయాలలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక రుద్రాభిషేకములు, అర్చనలు, ఉదయం 8 గంటలకు రుద్ర హోమము, సాయంత్రం 7 గంటలకు పల్లకి సేవ, రాత్రి 10.30కు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము, 12 గంటలకు లింగోద్భవ కాల ప్రత్యేక అభిషేకము, రాత్రి 1.30కు శివపార్వతుల కళ్యాణోత్సవము నిర్వహించనున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వాణాధికారి ఎన్.లావణ్య తెలిపారు. ఎండ నుంచి ఉపశమనం కోసం దేవాలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయడం జరిగిందని, భక్తులు సజావుగా దర్శనములు, అభిషేకములు నిర్వహించుకునేలా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు చేయడం జరిగిందని, త్రాగునీరు, మజ్జిగ, పండ్లు, ఉచిత ప్రసాదము పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇఓ లావణ్య తెలిపారు.

జలమండలి ఎండిని కలిసిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి ఫిబ్రవరి24, ప్రభాతవార్త : జలమండలి యం.డి. అశోక్ రెడ్డిని ఖైరతాబాద్ లోని తన కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా వచ్చే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని , మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని ఏడు జే.ఏ.సి కాలనీలలో డ్రేయిన్ ఔట్లేట్ ఏర్పాటుతో పాటు నీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని, కౌకూర్ జనప్రియ ఆర్కేడ్ లోని 600 ఫ్లాట్లకు మంచినీటి కనెక్షన్లను పునరుద్ధరించాలని, ఫాదర్ బాలయ్య నాగర్ రిజర్వాయర్లో తరచూ బోర్లు రిపేర్ అవుతున్నాయని, కొత్తవి ఆమర్చాలని,మల్కాజిగిరి నియోజకవర్గానికి సరఫరా అయ్యే నీటిని కొంతమేరకు పారిశ్రామిక అవసరాలకు సరఫరా చేయడం మానుకోవాలని,మంచినీటి సరఫరా సమయం పెంచాలని, గౌతం నగర్ వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ పునరుద్ధరించాలని, అదే విధంగా మల్కాజిగిరి పరిధిలోని 1300 మంది కన్సుమర్ల మీటర్ కాన్ నెంబర్లు మహీంద్రా హిల్స్ సెక్షన్ కు మార్చాలని కోరారు తద్వారా మంచినీటి సరఫరా కూడా మెరుగ్గా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలో దాదాపు 70 బోర్లకు మరమత్తులు చేయించాలని, మల్కాజిగిరి డివిజన్ కృపా ఆనంద్ అపార్ట్మెంట్స్ లో రెండు పవర్ బోర్లు వేయించాలని జలమండలి యం.డి. అశోక్ రెడ్డి ని కోరిన ఎమ్మెల్యే కోరారుఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత, సీనియర్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, జగదీష్ గౌడ్, డోలి రమేష్, అమీనుద్దిన్, లక్ష్మణ్ యాదవ్,శరణగిరి, సందీప్ రెడ్డి గో ఉన్నారు.

పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాలు.. ప్రజావాణిలో ఫిర్యాదులు

ప్రజావాణిలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న హబ్సిగూడ కాలనీ సంఘాల నేతలు

ఉప్పల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : రామంతాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని హబ్సిగూడకు చెందిన పలువురు కాలనీ సంఘాల నేతలు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం డిప్యూటి కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హబ్సిగూడ రవీంద్రనగర్, మహేశ్వరినగర్, సాయిచిత్రనగర్ కాలనీలకు చెందిన నేతలు కె.జైపాల్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, జి.కరుణాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ సర్వేనెం.44, 31లో ఉన్న రామంతాపూర్ పెద్ద చెరువు గతంలో 30 ఎకరాలకు పైగా స్థలంలో ఉండేదని, కబ్జాలు చేయడంతో ప్రస్తుతం 17 ఎకరాలు మిగిలిందని తెలిపారు. గత వర్షకాలంలో పబ్లిక్ స్కూల్ ప్రహరిగోడ వరకు వరద నీరు వచ్చిందని, చెరువు స్థలంలో అనేక నిర్మాణాలు నీట మునిగి ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. కాగా డీమార్ట్ ఎదురుగా కొందరు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని, ఇరిగేషన్ అధికారులు అక్రమాలకు పాల్పడి అనుమతులు జారీ చేశారని తెలిపారు. దీనిపై తాము హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుంటుండగా కొందరు అక్రమంగా నిర్మాణాలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ అంజనేయులు స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వడంలో అనుమతి ఇచ్చారని, దీనిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సదరు నిర్మాణం అనుమతి రద్దు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కాగా కొద్ది రోజుల క్రితం పెద్ద చెరువులో అనధికారికంగా బోరు వేస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేశారు.అయితే జిహెచ్ఎంసి, ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుల కారణంగా సదరు నిర్మాణదారుడికి కేవలం జరిమానా విధించినట్లు సమాచారం. ఇరిగేషన్, రెవెన్యూశాఖ, మున్సిపల్ అధికారుల అవినీతి వల్లే అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని కాలనీ సంఘం నేతలు ఆరోపిస్తున్నారు.

బడంగ్‌పేట్, బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి: బిజెపి నేతలు

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిశీలిస్తున్న నడికుడ యాదగిరి, గౌర రమాదేవి శ్రీనివాస్ తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్, బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలను బిజెపి నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లను, పారిశుధ్య పరిస్థితులను, మౌళిక సదుపాయాల సమస్యలను వారు పరిశీలించారు. అదే విధంగా ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయాన్ని కూడా వారు గుర్తించారు. అనంతరం వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మోడల్ స్కూళ్ళ సంగతేమో గానీ ఉన్న పాఠశాలలను పట్టించుకొని వాటిలో ఉన్న సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను గమనిస్తే విద్యార్థులు చదువుకోవాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఓబిసి మోర్చా కార్యదర్శి, మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, మాజీ కార్పొరేటర్ గౌర రమాదేవి శ్రీనివాస్, కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, కుంటి భాస్కర్, కొంతం ప్రకాశ్‌రెడ్డి, రావుల మల్లేష్, జగదీశ్వర్ రాజు, మోర మహేందర్, క్యారగారి అరవింద్, లాలా సందీప్, స్వీకృత్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, గడ్డం మధుతేజ పాల్గొన్నారు.

కాలనీలలో ఎక్కడ వ్యర్థాలు అక్కడే

మారుతి నగర్ రోడ్డు లో పేరుకుపోయిన చెత్తను చూపిస్తున్న కాలనీవాసులు.

వనస్థలిపురం. ఫిబ్రవరి. 24.ప్రభాతవార్త : బిఏన్ రెడ్డి నగర్ డివిజన్‌లో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది ,కాలనీలలో ఎక్కడ వ్యర్థాలు అక్కడే దర్శనమిస్తున్నాయి.బి ఏన్ రెడ్డి నగర్ డివిజన్ తీళిళీ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి. డివిజన్ లోని మారుతీనగర్ మెయిన్ రోడ్డులో పారిశుధ్య వ్యర్థాలు పేరుకపోయి దుర్వాసనతో పరిసర కాలనీ వాట్లు అవస్థలు పడుతున్నామని, దాదాపు 20 కాలనీ వాట్ళు ఈ దారి గుండా ప్రయాణిస్తారని, కాలనీ వాసులు ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తీళిళీ పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం మరియు అధికారులు ఇకనైనా నిద్ర మత్తు వీడి ప్రజల ఆరోగ్యం పట్ల మరియు కాలనీలలో పారిశుధ్యం పై దృష్టి సారించాలని, అలాగే రెండు రోజుల్లో మారుతినగర్ లో పెరుకపోయినా వ్యర్థ్యాలను తొలగించాలని , లేకుంటే కాలనీ వాసులతో కలిసి ధర్నా చేస్తామని జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్ గారిని మరియు తిలీబీవీ గారిని కటికిరెడ్డి అరవింద్ రెడ్డి గారు హెచ్చరించారు.మారుతినగర్ కాలనీ అధ్యక్షు లు దుర్గాప్రసాద్, స్నేహమైనగర్ కాలనీ అధ్యక్షులు రామాంజనేయులు, వైదేహినగర్ నార్త్ కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు, సిబిఐ కాలనీ అధ్యక్షులు మువ్వా సతీష్ చౌదరి, రషీద్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానవతా విలువలు పెంపొదించుకోవాలి
-సినీహీరో సాయికిరణ్

నలంద పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న సినీహీరో సాయికిరణ్

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: విద్యార్థులు మానవతా విలువలు పెంపొదించుకోవాలని సినీ హీరో సాయికిరణ్ పేర్కొన్నారు. చంపాపేట నలంద గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవం వేడుకులు కొత్తపేట బీజేఆర్ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ తల్లిదండ్రులను గౌరవించడం, సమాజంలో మానవతా విలువలను పెంపొదించుకోవడం నేర్పించాలని సూచించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడాల్లో రాణించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాలల్లో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో సినీనటి లక్ష్మివర్మ, ప్రముఖ్య జ్యోతిష్యుడు రామ్మోహన్, ప్రముఖ్య విద్యావేత శశాంక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాదేవుడికి తులాభారం మహోత్సవం

రుద్రాక్షలతో రూపొందించిన శివలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మహాదేవుడికి తులాభారం కార్యక్రమాన్ని భక్తిశద్ధలతో నిర్వహించారు. మహాశివరాత్రి అక్షర తులాభార లక్ష రుద్రాక్షల అభిషేక మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కొత్తపేట భవాని క్రాస్ రోడ్ శ్రీ భవాని మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజా కార్యక్రమంలో భాగంగా దేవాలయం చైర్మన్ భావన ఋషి, వీరమల్ల కాటంరాజు ఆధ్వర్యంలో వేద పండితుడు కోటేశ్వరరావు పౌరోహిత్యంలో వినూత్న రీతిలో రూపాయి నాణాలు, లక్ష రుద్రాక్షలతో తులాభారం, అభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష రుద్రాక్షల దారుక మహా శివలింగేశ్వరుడికి నరదిష్టి నివారణ అభిషేకాన్ని అఖండ శివ పంచాక్షరి మంత్రము, జపము, తర్పణము, హోమం కార్యక్రమంతో ఆ ప్రాంతం పరమేశ్వరుని తలుచుకుంటూ భక్తులు పరవశించి పోతున్నారు. అదేవిధంగా మహా మృత్యాంజయ పాశుపత రుద్ర, దుర్గా హోమము, పూర్ణాహుతి కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

సిఎస్ఆర్ నిధులతో పార్కుల అభివృద్ధి : ఎమ్మెల్యే

పార్కు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ చేతన

ఉప్పల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : సిఎస్ఆర్ నిధులతో పార్కుల అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు హబ్సిగూడ వీరరాజిరెడ్డి పార్కులో చిన్న పిల్లల పార్కులో మౌళిక సదుపాయాలు, ఆట వస్తువులను స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతనతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర